క్లుప్తంగా

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి: డీఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారం, ట్రాఫిక్ నియంత్రణపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. దీపావళి పండగ నేపథ్యంలో మందుగుండు అక్రమ అమ్మకాలు, నిల్వలు, రవాణా జరగకుండా చూడాలన్నారు. నిత్యం రోడ్డు ప్రమాలు చోటుచేసుకుంటున్న కూడళ్ల వద్ద జంగిల్ క్లీయరెన్స్ పనులను సంబంధిత శాఖల సహకారంతో చేయించాలని సూచించారు. సీఐ కె.మురళీధర్, ఎస్సై బి.శివప్రసాద్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు అల్లు పోలినాయుడు, సావిత్రమ్మలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు ఆర్థిక సాయం అందించారు. సోమవారం కొంకడివరం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. రూ.2వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి పక్కా గృహం మంజూరుతో పాటు నష్టపరిహారం అందేలా కృషిచేస్తానన్నారు. ఆయనతో పాటు ఒ.జనార్దననాయుడు, జి.జనార్దననాయుడు తదితరులున్నారు.

జగనన్న కాలనీలో బోరు ఏర్పాటు



బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం గ్రామంలో జగనన్న కాలనీలో రూ.2 లక్షల వ్యయంతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. హౌసింగ్ ఏఈ మాధవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హెచ్.ప్రవళిక సోమవారం పనులను పర్యవేక్షించారు. కాలనీలో తాగునీటి అవసరాలతో పాటు ఇళ్ల నిర్మాణ పనులకు నీరు అందించేందుకు బోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ఎం.సింగుపురం పంచాయతీ పరిధి బియ్యాలవలసలో రూ.8 లక్షలతో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను సర్పంచ్ ఆర్.రమాదేవితో కలిసి పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.

ఆరోగ్యంపై అవగాహన



కూరగాయ విత్తనాల ప్యాకెట్లు అందిస్తున్న సేవా సదన్ ప్రతినిధులు

భామిని: మండలంలోని చింతమానుగూడ, లచ్చయ్యపేటలలో సోమవారం స్ఫూర్తి సేవా సదన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారంపై సేవా సదన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.భీష్మ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పెరటితోటల సాగుకు అవసరమైన కూరగాయల విత్తన ప్యాకెట్లను అందజేశారు. విద్యార్థులకు సాయంత్రం పూట ట్యూషన్ చెప్పేందుకు వలంటీర్లను సంస్థ నియమిస్తుందన్నారు.

ప్రజారక్షణ బేరీ పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట: ఈనెల 15న విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బి.అప్పారావు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర నాయకులు అంతా ఈ బహిరంగ సభకు హాజరవుతారని, ప్రతీ ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జె.శ్రీరాములు, బి.సాయి, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

భామిని: స్పందనలో అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారంపై సిబ్బందితో చర్చించారు. డీటీలు నిమ్మల శేఖరం, రమేష్‌కుమార్, ఆర్‌ఐ ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చారిత్రకం



పాలకొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ప్రజాసంకల్పయాత్ర ఒక చారిత్రకమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ కూడలి వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదయాత్ర ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం మండలాల పార్టీ అధ్యక్షులు కనపాక సూర్యప్రకాష్‌రావు, దమలపాటి వెంకటరమణనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **సీతంపేట:** స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- **భామిని:** ప్రజల సంకల్పానికి అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కన్వీనర్ కె.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కొరమ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, అగతముడి రఘు, సిగడాన రాజు, ఎరుకుమజ్జి పాపినాయుడు, ఎ.జగదీష్ పాల్గొన్నారు.



సీతంపేట: వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు



భామిని: డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- **కురుపాం:** ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మండలంలోని రావాడ కూడలిలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, పార్టీ నాయకులు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటీశ్వరరావు కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గొడు సంతోషిరాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు గౌరీశంకరరావు, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, షేక్ జిలాని, సర్పంచ్ ఆదిల్, ఆకుల శ్రీధర్, రాయిపిల్లి శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.



కురుపాం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జగనన్నతోనే జనరంజక పాలన

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: అధికారం చేపట్టినప్పటి నుంచి జనరంజక పాలన అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే సాధ్యం అయ్యిందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురంలో సర్పంచ్ రణస్థలం రమాదేవి అధ్యక్షతన సోమవారం చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రతీ గడపగడపకు వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీజీఎంపీ నిధులతో గ్రామస్తులకు అవసరమైన పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, సర్పంచుల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోలుగు విశ్వేశరరావు, తిర్లంగి ఉపేంద్రకుమార్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ, ప్రసాద్, నేతల శిమ్మినాయుడు, రామచంద్రినాయుడు, నేపాకుల మురళీధర్, బిడ్డక వెంకయ్య, ఆనంద్, జి.రామిచంద్రినాయుడు, ఏఓ డోంక త్రినాథులు, ఎస్సై బి.ఎస్.ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామస్తులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగనన్న చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

నేడు భామినిలో జీజీఎంపీ

భామిని: మండల కేంద్రం భామినిలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

9 నుంచి 'వై ఏపీ నీడ్ జగన్'

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఈ నెల 9 నుంచి 'వై ఏపీ నీడ్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి)' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 9న ఎల్విన్‌పేట-2 గ్రామ సచివాలయం పరిధిలో, 10న గుమ్మలక్ష్మీపురంలో, 14న చెముడుగూడలో, 15న మండలో, 16న పి.ఆమిటిలో, 17న దుమ్మంగిలో, 20న ఇరిడిలో, 21న కొండవాడలో, 22న లుంబేసులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్ జగన్ (ఏపీకి జగనే ఎందుకు కావాలి)' కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు సోమవారం తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు రహదారి నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పంచాయతీ చాపరాయి జంగిడిభద్ర నుంచి ఓడ్రుబంగి గ్రామానికి, అలాగే ఎగువ తాడికొండ నుంచి లుంబేసు పంచాయతీ దేరుగండ గ్రామానికి రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మంగళవారం భూమిపూజ చేయనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

గ్రామ సచివాలయాలతో సేవలు చేరువ



శిఖబడిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడి, అలమండలో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను, అలమండలో రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, దీని వల్ల సమయం, డబ్బు వృథా అయ్యేవని గుర్తుచేశారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు, పథకాలు గ్రామంలోనే అందుతున్నాయన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శిఖబడి సర్పంచ్ కోట రమేష్, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, జెడ్పీటీసీ శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, మాజీ ఎంపీటీసీ బడే మన్మథరావు, వైస్ సర్పంచ్ భార్గవనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు ఆర్నిపల్లి వెంకటనాయుడు, మరడాన కిశోర్, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు ఉషారాణి పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కాలేజ్ (పీటీజీ)లో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకులు లేకపోవడంతో ఆయా సబ్జెక్టుల బోధన సరిగా జరగక విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దీనిపై స్పందించి అధ్యాపకులను నియమించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

తుప్పల తొలగింపు



రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదలు తొలగిస్తున్న పోలీసులు, యువత

గుమ్మలక్ష్మీపురం: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. సర్కిల్ పరిధిలో ఎల్విన్‌పేట నుంచి బత్తిలి, గుణుపూర్ వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను స్థానిక యువతతో కలిసి సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వాహనదారులు రోడ్డ భద్రత నియమాలు పాటించాలని కోరారు. ఎస్సై ఎస్.షణ్ముఖరావు, పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా మందుగుండు అమ్మరాదు

భామిని: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దీపావళి మందుగుండు సామాన్లు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మనరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా మందుగుండు నిల్వ చేసినా, రవాణా చేసినా, లైసెన్స్ లేకుండా విక్రయించినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని కోరారు. ఎవరైనా అక్రమంగా మందుగుండు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఆపదలో ఆదుకుంటున్న సీఎంఆర్ఎఫ్

వీరఘట్టం: ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని సంత-నర్సిపురం గ్రామానికి చెందిన నల్ల సింహాచలం అనే మహిళకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం లబ్ధిదారుకు అందజేశారు. సింహాచలం భర్త కొద్దిరోజుల కిందట పాముకాటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి గోవిందరావు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకురాగా.. ఆమె వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఆ చెక్కును గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారుకు ఎమ్మెల్యే అందజేశారు.



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం: తెలుగు భాష, సాహిత్యం, ఔన్నత్యంపై శతక పుస్తకాలు రచించిన చిగురుమళ్ల శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహించే శాంతి సద్భావనా యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) పార్వతీపురం మన్యం జిల్లా సమన్వయకర్త పి.దేవానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 తెలుగు సంఘాలు సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శాంతి సద్భావనా యాత్ర ఈనెల 9న ఆఫ్రికాలోని బోట్స్‌వానా (ఇండియన్ హైకమిషన్ ఆఫీస్)లో ప్రారంభం కానుందన్నారు. తెలుగు భాష, సాహిత్యం, దాని ఔన్నత్యం గురించి ప్రపంచ దేశాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో శ్రీనివాస్ ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు డి.శ్రీలక్ష్మి, ఎస్.శ్రీకాంత్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, తదితరులు

పేదలకు ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



జియ్యమ్మవలస: ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీనివాసరావు



సీతంపేట: వజ్జాయిగూడ జేఏఎస్ శిబిరంలో వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

జియ్యమ్మవలస: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బిత్రపాడు గ్రామంలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో డాక్టర్ పి.శ్రీధర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సింధు శ్రావణి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని వజ్జాయిగూడ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీడీఓ గీతాంజలి వైద్య సేవలను పర్యవేక్షించారు.

కరవు మండలంగా ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం:

గుమ్మలక్ష్మీపురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కమిటీ నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, రాజారావు, సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ జె.రాములమ్మకు వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గుమ్మలక్ష్మీపురం మండలంలో వరి, పత్తి పంటలను రైతులు నష్టపోయారని, వారికి పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే బ్యాంకులో తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని, ప్రతి ఒక్కరికీ 200 రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆలయ నిర్మాణానికి రూ.7 లక్షలు విరాళం

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాక్షి వినాయకుని ఆలయ నిర్మాణానికి న్యూజిలాండ్‌లో విధులు నిర్వహిస్తున్న సప్ప శ్రీనివాస్ ప్రసాద్ రూ.7 లక్షలు విరాళం అందించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డి.పారినాయుడు సోమవారం తెలిపారు. విశ్రాంత ఆర్టీసీ డిపో మేనేజర్ బీవీఎస్ నాయుడు చొరవతో సప్ప సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆలయ నిర్మాణానికి విరాళం అందించినట్లు తెలిపారు. తోటపల్లి ఆలయం పూర్వవైభవానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

చెరువులు ఆక్రమిస్తే చర్యలు



పెద్దూరులో చెరువును పరిశీలిస్తున్న ఉప గణాంకాధికారి జయప్రకాష్

గరుగుబిల్లి: పార్వతీపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ఆక్రమణకు గురైన చెరువులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు డివిజనల్ ఉప గణాంకాధికారి కె.జయప్రకాష్ అన్నారు. మండలంలోని పలు చెరువుల స్థితిగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువుల ఆక్రమణపై క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓలు, ఏఎస్‌ఓలు పరిశీలన చేసి నివేదికలు సమర్పించాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ కె.విజయరావు, వీఆర్‌ఓ బాలబాబు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలకొండ: ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వి.తులసీరామ్, దావాల రమణారావు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సర్క్యులర్ ప్రకారం వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాదా రాము, సిబ్బంది పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు